ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0


మిడ్జిల్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ వద్ద లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి(ఫైల్)

ఇందిరమ్మ పరుగులు

పాలమూరు జిల్లాకు 10,472 ఇళ్లు మంజూరుకాగా, 6,300 ఇళ్లకు మార్కింగ్

- 11,00 ఇళ్లకు రూ.12 కోట్లు చెల్లింపు
- డబుల్ బిల్లులు స్వాహా చేయకుండా జియో ట్యాగింగ్
- లబ్ధిదారులకే నేరుగా బిల్లుల చెల్లింపు
- ఏఐ టెక్నాలజీతో పూర్తి పారదర్శకత
- నిర్మాణ వ్యయం తగ్గించేందుకు చర్యలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరుగులు పెడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ పథకాన్ని అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి, ఏవైనా సమస్యలుంటే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు 10,472 ఇళ్లు మంజూరు కాగా, 1,941 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 11,00 ఇళ్లకు చేపట్టిన పనుల మేరకు బిల్లులు సైతం చెల్లించారు. జియో ట్యాగింగ్ వల్ల పథకంలో అక్రమాలు జరుగకుండా, ఏఐ సాంకేతికతతో నిర్దిష్ట స్థలంలో నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

- మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇల్లులేని ప్రతీ నిరుపేద సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పథకాన్ని అమలు చేస్తుండటంతో పాలమూరు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం పరుగులు పెడుతోంది. గతంలో జరిగిన పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి పారదర్శకత, పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మధ్యవర్తులు, పైరవీకారుల జోక్యం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో బిల్లులు జమ చేస్తున్నారు. ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్) సాంకేతికతను వినియోగిస్తూ నిర్మాణాలు నిబంధనల ప్రకారం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలతో పాటు పరిగి నియోజకవర్గంలోని గండీడ్, మహమ్మదాబాద్, నారాయణపేట నియోజకవర్గంలోని కోయిలకొండ మండలాలు, వనపర్తి నియోజకవర్గంలోని రెండు గ్రామాలు ఇలా మొత్తం ఆరు నియోజకవర్గాలకు సంబంధించి 10,472 ఇళ్లను మంజూరు చేశారు. ఇప్పటివరకు 6,300 ఇళ్లకు అధికారులు మార్కింగ్ ఇచ్చారు. అందులో 1,620 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్‌లో నిర్మాణాలు జరుగగా, 220 ఇళ్లు గోడల దశలో, 100 ఇళ్లు స్లాబ్‌లు దశలో ఉన్నాయి. ఒక ఇంటికి మాత్రం గృహ ప్రవేశం చేశారు. 1,941 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, వాటికి రూ.12 కోట్ల బిల్లుల లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు.

జియో ట్యాగింగ్‌తో అక్రమాలకు చెక్

మార్కింగ్ ఇచ్చే సమయంలోనే ప్రతీ ఇంటికి జియో ట్యాగింగ్ కోఆర్డినేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో లొకేషన్ గుర్తిస్తారు. ఇక అదే స్థలంలో లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గతంలో పథకంలో ఒకే బేస్‌మెంట్‌కు, ఒకే ఇంటికి పదుల సంఖ్యలో బిల్లులు డ్రా చేశారు. ఇప్పుడు జియో ట్యాగింగ్ వల్ల ఆధార్ బేస్‌డ్‌తో ఉన్న అకౌంట్‌లోనే నిధులు జమ చేస్తున్నారు. ఒక ఇంటిపై ఎక్కువ బిల్లులు తీసుకునే అవకాశం ఉండదు.

అక్కడే సమస్యలు క్లియర్

లబ్ధిదారుడి బ్యాంక్ అకౌంట్‌లో తప్పు లున్నా, ఆధార్, బ్యాంక్ ఖాతాలో తప్పులు దొర్లినా, పేర్లు సరిగా లేకుండా పేమెంట్‌లు ఇవ్వడానికి ఇబ్బందులు ఉంటే వాటిని ఎంపీడీవో స్థాయిలోనే పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ప్రతీ సోమవారం అధికారులు మానిటరింగ్ చేయాల్సి ఉంటుంది. కలెక్టర్, హౌసింగ్ పీడీలు ఎప్పటికప్పుడు పథకాన్ని పర్యవేక్షిస్తూ పథకం వేగంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఏఐతో పక్కాగా

ఏఐ సాంకేతికతతో ఇంటి నిర్మాణాలను నిర్దిష్టంగా జరిగేలా చూస్తున్నారు. చూట్టూ బేస్‌మెంట్ కట్టి మధ్యలో గోడలు కట్టకుండా బిల్లులు కావాలంటే ఇవ్వరు. సగం సగం బేస్‌మెంట్ కట్టినా, పాత బేస్‌మెంట్‌ను కొత్తగా చూయించినా ఏఐ టెక్నాలజీ పట్టేస్తుంది. నిర్మాణం విడతల వారీగా నిబంధనల మేరకే చేయాల్సి ఉంటుంది. ప్రతీ దశలో నిర్మాణానికి సంబంధించి ఫొటో తీయాల్సి ఉంటుంది. ఫొటోలు తీసి, ఆ ప్రకారంగా బిల్లులు చెల్లిస్తారు.

మేస్త్రి ఖర్చు రూ.3.50 లక్షలా?

జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి గురువారం మిడ్జిల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఓ లబ్ధిదారుడు కలెక్టర్ వద్దకు వచ్చి నిర్మాణ వ్యయం ఎక్కువ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నిర్మాణానికి మేస్త్రి రూ.3.50 లక్షలు అడుగుతున్నారని కలెక్టర్ దృష్టికి తేగా కలెక్టర్ అవాక్కయ్యారు. రూ.5 లక్షల ఇందిరమ్మ ఇంటికి రూ.3.50 లక్షలు మేస్త్రి అడగడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. 400-500 ఎస్ఎఫ్‌టీ గల నిర్మాణానికి ఒక్కో ఎస్ఎఫ్‌టీకి రూ.250 నుంచి రూ.300 సరిపోతుందని కలెక్టర్‌కు అధికారులు వివరించగా లబ్ధిదారుల నిర్మాణ వ్యయం తగ్గించేలా యంత్రాంగం చూసుకోవాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

అనవసరమైన ఖర్చులు తగ్గించాలి

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నాం. లబ్ధిదారులు అనవసరమైన ఖర్చులు తగ్గించుకోవాలి. ఒక్కో ఎస్ఎఫ్‌టీకి మేస్త్రీకి రూ.250 రూ.300 లోపు చెల్లింపులు చేసుకోవాలి. ఇందిరమ్మ కమిటీలు భాగస్వామ్యం అయ్యి, రవాణా ఖర్చులు, ఇసుక ఖర్చులు తగ్గించేలా చూసుకోవాలి.

- వైద్యం భాస్కర్, హౌసింగ్ పీడీ


సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సంక్షేమం కోసం.. రూ.లక్ష కోట్లు ఖర్చు

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- రూ. 65.67 కోట్ల అంచనా వ్యయంతో 7 విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన

కొల్లాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజల సంక్షేమం కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో సురభి కోట ముందు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, అర్హులైన 4వేల మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్ల హక్కు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ ఫరూఖీ, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాసరెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లు రవి హాజరయ్యారు. మల్లు భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు రూ.65.67 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న 7 విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బంగ్లా ముందు ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలు వారి సమస్యలను నాయకులకు స్వేచ్ఛగా చెప్పుకుంటున్నారని తెలిపారు. రాయలసీమ ఎత్తిపోతల పైప్రాంతంలో తెలంగాణ భూ భాగంలో ఒక డ్యామ్ కడితే పెద్ద ఎత్తున కృష్ణానీటిని తీసుకునే అవకాశం ఉన్నా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు ఆలోచన చేయలేదని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వేగవంతం చేశామన్నారు. పర్యాటక రంగంలో తెలంగాణ ప్రపంచాన్ని ఆకర్షించేలా మంత్రి జూపల్లి కృషి చేస్తున్నారని తెలిపారు.

కొల్లాపూర్‌తో ప్రత్యేక అనుబంధం

తమ సోదరుడు స్వర్గీయ మల్లు అనంత రాములు 1980లో నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేసిన సమయంలో తాను విద్యార్థిగా ఉన్నానని భట్టివిక్రమార్క తెలిపారు. ఆ సమయంలో తనను కొల్లాపూర్ ఇన్‌చార్జిగా నియమించారని, ఆనాడే తాను రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానని తెలిపారు. 98 జీవో బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కోన్ పూచ్‌తే కొల్లాపూర్ నుంచి సబ్‌పూచ్‌తే కొల్లాపూర్ స్థాయికి ఎదిగిందన్నారు. కొల్లాపూర్‌లో అడ్వాన్స్‌డ్ ఐటీఐ కళాశాల ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు.

వెల్టూరు, చిన్నమారూర్ మధ్య డ్యాం నిర్మించాలి: జూపల్లి

మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోతిరెడ్డిపాడు కాల్వ ద్వారా కృష్ణా జలాలను ఇప్పటికే భారీగా తరలించుకుపోతున్నదని అన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణతో మన ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరగనుందన్నారు. ఈ ప్రాంత నీటి సమస్య తీరాలంటే వెల్టూరు, చిన్నమారూర్ మధ్య కృష్ణానదిపై ఒక డ్యాం నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒక ఎకరం కూడా

(మిగతా 6లో..)

డిసెంబరు 9లోగా.. పరిహారం

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు డిసెంబరు 9వ తేదీలోగా పరిహారం చెల్లిస్తామని, అందుకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేసిన విషయం అందరికీ తెలిసిందేనని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిహారం ఇప్పటికే రూ.250 కోట్లు విడుదల అయ్యాయన్నారు. అవార్డు పాసు కానందున నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో జాప్యం అయ్యిందని చెప్పారు. డిసెంబరు 9వ తేదీలోగా పరిహారం చెల్లిస్తామని ముంపువాసులకు తన మాటగా చెప్పి, వారందరితో విందుభోజనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా తనకు చెప్పాడన్నారు. ఈ మేరకు ఈ నెల 3న ఆదివారం వల్లూరు సమీపంలో ముంపువాసులతో పార్టీల

సీఎం కోరిక మేరకు ఉదండాపూర్ ముంపువాసులతో నేడు విందు భోజనం


విలేకరులతో మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

కతీతంగా విందు భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంకా అభ్యంతరాలు ఉంటే మంగళవారం నాడు కలెక్టరేట్‌లో కలెక్టర్ నిర్వహించే సమావేశంలో పాల్గొని పరిష్కరించుకోవాలని సూచించారు. పరిహారం పెంచి తీసుకువచ్చే బాధ్యత తనదేనన్నారు. ప్రస్తుతం పరిహారం రూ.16.30 లక్షలు చెల్లిస్తున్నామన్నారు. పరిహారం అందిన వారికి సైతం పెంచిన వ్యత్యాసం వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. గత ప్రభుత్వం రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చిన కారణంగా నిర్వాసితులకు పరిహారం అందడంలో ఆలస్యమైందన్నారు. జడ్చర్ల మీదుగా నిర్మాణం జరుగుతున్న 167వ జాతీయ రహదారిపై జడ్చర్ల పట్టణం నుంచి పాత బజారుకు పెద్దవాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా డిజైన్ ఉందని, సమస్య పరిష్కరించడానికి ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. బైపాస్ రోడ్డు అంశంలో త్వరలో అధికారిక డీపీఆర్ స్పష్టత వస్తుందన్నారు. తాను చదువుకున్న వాడినని, దొంగ డిగ్రీలు లేవని, ఎవరో చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనని వెల్లడించారు. సమావేశంలో భాష, సాంస్కృతిక సలహా మండలి సభ్యుడు బాదిమి శివకుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలకు మంచి పేరు తేవాలి

- మూడో విడత కౌన్సెలింగ్ పూర్తయ్యాక స్పాట్ అడ్మిషన్ నిర్వహించాలి
- త్వరలో 25 మంది సిబ్బందిని నియమిస్తాం
- రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన


కళాశాలలోని ల్యాబ్‌ను పరిశీలిస్తున్న దేవసేన

కోస్గి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కోస్గి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలకు మంచి పేరు తేవాలని రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన అన్నారు. శనివారం ఆమె కళాశాలను తనిఖీ చేశారు. కళాశాలలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కోర్సులు నిర్వహిస్తున్నారని తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఇంజనీరింగ్ మూడు కోర్సులలో రెండు కౌన్సెలింగ్‌ల ద్వారా భర్తీ అయిన సీట్ల వివరాలపై ఆరా తీశారు. మూడో కౌన్సెలింగ్ ఈనెల 5వ తేదీ నుంచి ఉందని, అది పూర్తయ్యాక మిగిలిన సీట్లు స్పాట్ అడ్మిషన్ ద్వారా తీసుకోవాలని సూచించారు. అనంతరం ల్యాబ్‌లను పరిశీలించారు. త్వరలో 25 మంది సిబ్బందిని నియమిస్తామన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణాన్ని పరిశీలించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను మార్చాలని, అనారోగ్య కారణాలతో కళాశాలను పట్టించుకోవడం లేదని కోస్గి విద్యావంతుల వేదిక సభ్యులు భద్రీనాథ్ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

'పేట' కలెక్టర్‌కు నీతి అయోగ్ అవార్డు


గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అభియాన్ పథకంలో నారాయణపేట జిల్లా నర్వ బ్లాక్ ఆరోగ్యం, పోషకాహారం, సామాజిక అభివృద్ధి(సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ రివాల్వింగ్ ఫండ్)లోని ఆరు సూచికలలో ఐదింట్లో సంతృప్తికరమైన ఫలితాలు సాధించినందుకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా శనివారం నీతి అయోగ్ వెండి పతకాన్ని అందుకున్నారు. రాజ్‌భవన్‌లో పతకాన్ని తీసుకున్నారు. సంపూర్ణ అభియాన్ పథకంలో నర్వ బ్లాక్‌లో ప్రసూతి సంరక్షణ నమోదులో వంద శాతం ఫలితాలు సాధించారు. రక్తపోటు స్క్రీనింగ్‌లో వంద శాతం, డయాబెటిస్ స్క్రీనింగ్, గర్భిణులకు అనుబంధ పోషక ఆహారాన్ని అందించడం, స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీని అందించడంలో వందశాతం ఫలితాలు సాధించినందుకు పతకాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహం కోసం..

- ఆపదలో ఆదుకుంటూ చేయూతనిస్తోన్న స్నేహితులు
- పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో మిత్ర సంఘాలు
- నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం

7

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

- 220 గ్రాముల గంజాయి ప్యాకెట్ల పట్టివేత

7


కుటుంబ సభ్యుల వద్దకు చేరిన తప్పిపోయిన మహిళ

- మతిస్థిమితం లేక ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన సబియా బేగం

7

పాలమూరుకు మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్

- అందులో అత్యాధునిక ఫోరెన్సిక్, క్లూస్‌టీమ్ పరికరాలు
- ప్రారంభించిన ఎస్పీ జానకి


ఫోరెన్సిక్ మొబైల్ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో పోలీస్ శాఖ మరో ముందడుగు వేసింది. పాలమూరుకు మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ నుంచి వచ్చిన ప్రత్యేక మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌ను జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఎస్పీ జానకి శనివారం ప్రారంభించారు. ఈ మొబైల్ వ్యాన్‌లో అత్యాధునిక ఫోరెన్సిక్, క్లూస్ టీమ్‌కు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల నేర పరిశోధన మరింత వేగంగా సాగేందుకు అవకాశం ఉంటుంది. ఏదైన ఘటన జరిగినప్పుడు ఘటనా స్థలానికి వేగంగా చేరుకుని అక్కడ ఆధారాలను సేకరించేందుకు ఈ వాహనం ఎంతగానో దోహదం చేస్తుంది. దాంతో ఈ వాహనం వేగంగా అక్కడికి చేరుకుని ఫోరెన్సిక్ పరికరాలతో ఆధారాలు సేకరించేందుకు దోహదపడుతుంది. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఆర్ఐలు పాల్గొన్నారు.

కవాతు మైదానంలో వీక్లీ పరేడ్

జిల్లా పోలీసు కవాతు మైదానంలో శనివారం వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ జానకి పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలీసు విధుల్లో నిత్యం ఒత్తిడి, భౌతిక, మానసిక శ్రమ ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకే ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. సమయం దొరికినపుడల్లా కుటుంబంతో గడిపి, ఆత్మీయతను పెంపొందించుకోవాలని చెప్పారు. యోగా, మెడిటేషన్ చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా బలంగా ఉండొచ్చన్నారు. ఆరోగ్యం బాగున్నపుడే సేవలు ప్రతిభావంతంగా ఉంటాయని అన్నారు. విధుల్లో అంకితభావంతో పనిచేసి, ప్రజల మన్ననలను అందుకునేందుకు కృషి చేయాలని కోరారు.

మత్స్య సంపద కోర్సులతో ఉద్యోగ అవకాశాలు

- ఎంసెట్ అర్హతల ఆధారంగా సీట్ల కేటాయింపు
- పరిశోధనలు చేసేందుకు సౌకర్యవంతమైన వసతులతో కళాశాల ఏర్పాటు
- నాలుగేళ్ల పాటు జలసంవర్ధక విద్య
- రాష్ట్రంలోనే ఏకైక చేపల కళాశాల



శిక్షణ పొందుతున్న విద్యార్థులు(ఫైల్)



మెండుగా ఉద్యోగ అవకాశాలు

తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక మత్స్య కళాశాల. విద్యార్థులకు మత్స్య రంగంలో మెండుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. రోజు రోజుకు చేప మాంసం వినియోగం పెరుగుతున్నది. విదార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థిని, విదార్థులకు వేరు వేరుగా వసతి గృహాలు, భోజనశాల, సౌకర్యవంతమైన వసతులు కల్పిస్తున్నాం.

- డాక్టర్ దుర్గం సకారాం, అసోసియేట్ డీన్, మత్స్య కళాశాల, పెబ్బేరు మునిసిపాలిటీ

పెబ్బేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అందరూ నడిచే దారిలో ప్రయాణమా... అరుదైన కోర్సులతో భిన్నమైన మార్గమా... అర్హతలకు తగిన ఉద్యోగం దొరికితే చేరిపోదామా అనే ప్రశ్నలు ఇంటర్ చదివిన విదార్థులను వెంటాడుతుంటాయి. ఇంటర్ పూర్తి చేసిన వారు ప్రధానంగా ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులపైనే చాలా మంది దృష్టి సారిస్తారు. వీటితో పాటు మత్స్య రంగం విద్యలో ప్రభుత్వ కొలువులు, స్వయం ఉపాధితో పాటు ప్రైవేట్ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయి.

రాష్ట్రంలోనే ఏకైక మత్స్య కళాశాల..

పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్యశాలకు అనుబంధంగా వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీలో గత ప్రభుత్వం 2017లో మత్స్య కళాశాల ఏర్పాటు చేసింది. మత్స్య రంగాన్ని విస్తరింప చేయడంతో పాటు చేపల పెంపకంపై పరిశోధనలను అభివృద్ధి చేసేందుకు 27.5 ఎకరాల్లో శాశ్వత కళాశాల భవనం, విద్యార్థిని, విదార్థులకు విడివిడిగా వసతి భవనాలు, భోజనశాల భవనాలను ఏర్పాటు చేసింది. ఈ కళాశాలల్లో విద్యార్థులకు ఆక్వా కల్చర్, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ వంటి అంశాలపైన బోధిస్తున్నారు. మత్స్యకారులకు ప్రత్యేక శిక్షణ, పురోగతిపై విస్తరణ వంటి తదితర అంశాలను తెలియజేస్తుంటారు. ఇందులో డిగ్రీ చదివి పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశం ఉన్నది.

ఎంసెట్ అర్హతల ఆధారంగా సీట్ల కేటాయింపు

ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసి ఎంసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక విధానం నిర్వహిస్తారు. నాలుగేళ్ల పాటు జలసంవర్ధక విద్య కోసం ప్రతీ ఏటా 26మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. మొదటి మూడేళ్ల మత్స్య రంగ కోర్సులపై బోధిస్తారు. చివరి ఏడాది పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. నాలుగేళ్ల విద్యను పూర్తి చేసిన వారికి మత్స్యశాఖ అభివృద్ధి అధికారులుగా, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్లుగా ప్రభుత్వ కొలువులు పొందవచ్చు. బ్యాంకింగ్ రంగంలో టెక్నికల్ ఫీల్డ్ ఆఫీసర్లుగా కొలువులు లభిస్తాయి.

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

- ఇన్‌ఫ్లో 2.69 లక్షలు, అవుట్‌ఫ్లో 2.53 లక్షల క్యూసెక్కులు
- జూరాల ప్రాజెక్టుకు నుంచి 1.80 లక్షలు, ఆల్మట్టి నుంచి 80 వేలు, భీమానది నుంచి 90 వేల క్యూసెక్కులు రాక



శ్రీశైలం ప్రాజెక్టు ఆరు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

గద్వాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. ఆల్మట్టి, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి కొంత వరద తగ్గినప్పటికీ భీమా నది నుంచి వరద కొనసాగుతోంది. దీంతో శనివారం శ్రీశైలం ప్రాజెక్టుకు 2.69 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఆరు గేట్ల ద్వారా 1,61,530 క్యూసెక్కులు, ఎడమ, కుడి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 66,102 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.20 అడుగుల్లో 215 టీఎంసీలకు గాను 200.19 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఇక ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. 1.29 లక్షలు ఉండగా అవుట్‌ఫ్లో 80 వేల క్యూసెక్కులు ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అవుట్‌ఫ్లోను 48,600 క్యూసెక్కులకు తగ్గించారు. ఇక భీమా ప్రాజెక్టు నుంచి వరద కొనసాగుతోంది. సన్నతి బ్యారేజీకి ఇన్‌ఫ్లో 90 వేలు ఉండగా అంతే మొత్తం దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 1.60 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10 గేట్ల ద్వారా 99,460 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 25,843 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా శ్రీశైలంకు 15,516 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు..

మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించారు. అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటీ వార్డెన్, డాటా ఎంట్రీ ఆపరేటర్ అదే సంస్థలో పని చేస్తున్న మణెమ్మ అనే స్వీపర్‌ను పదివేల రూపాయలు లంచం అడిగిన నేపథ్యంలో ఆడియో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో మైనార్టీ రెసిడెన్షియల్ రీజనల్ కో ఆర్డినేటర్ బాబుద్దీన్, జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యాయులు గోపాల్‌నాయక్ ఇచ్చిన నివేదిక మేరకు డిప్యూటీ వార్డెన్ దర్వేష్, డాటా ఎంట్రీ ఆపరేటర్ ముస్తాక్‌లను తక్షణం తొలగించారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో పిల్లలతో పాత ఇనుప సామాన్లు మోయించిన వార్డెన్ సుంకన్నపై కూడా విచారణ నివేదికను అందించారు. అతనిపై కూడా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

కాంస్య పతకం అందుకున్న జాగిలం రుద్ర



వరంగల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీలో క్యాంస పథకం అందుకున్న పేట జిల్లాకు చెందిన జాగిలం రుద్ర

నారాయణపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పోలీస్ జాగిలం రుద్ర బ్రాంజ్(కాంస్య) మెడల్ శనివారం అందుకుంది. వరంగల్ జిల్లాలోని పీటీసీ మమునూరులో మూడు రోజులుగా జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగుళాంబ జోన్ నుంచి ట్రాకింగ్ విభాగం పోటీల్లో పాల్గొని హత్యా నేరాలు, దొంగతనాలను ట్రాకింగ్ చేయడంలో పేట పోలీస్ జాగిలం రుద్ర, డాగ్ హ్యాండ్లర్ రవికి బ్రాంజ్ మెడల్ వచ్చింది. ఈ విషయాన్ని జోగు ళాంబ జోన్ పోలీస్ డ్యూటీ మీట్ నోడల్ అధికారి అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్ తెలిపారు. డాగ్ రుద్ర, హ్యాండ్లర్ రవిని అదనపు ఎస్పీ అభినందించారు. 2026 సంవత్సరం ఫిబ్రవరిలో పుణెలో జరిగే నేషనల్ పోలీస్ డ్యూటీ మీట్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని అదనపు ఎస్పీ ఆకాంక్షించారు.

కిసాన్ డబ్బుల కోసం కన్న తల్లిపై దాడి

- తలపగిలి గాయాలతో ఆసుపత్రిపాలు
- ఇద్దరు కొడుకులపై కేసు నమోదు

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనిపెంచి పెళ్లిళ్లు చేసి సాది సంతరించిన తల్లికి అన్నం పెట్టలేదు.. ఆమె పేరిట భూమిని అనుభవిస్తూ.. కూడా ఆమెకు వ చ్చే రైతుబంధు, పీఎం కిసాన్ డబ్బుల కోసం వేధించారు. ఇవ్వనం టే చిన్న కొడుకు బెదిరించాడు. పెద్ద కొడుకు దాడిచేశాడు. హృద యవిషాదకర ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండ లం, కలుగొట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థు ల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ నాగన్న, లక్ష్మీదేవ మ్మలకు శంకర్, మల్లికార్జున్ ఇద్దరు కొడుకులు. వీరికి 2ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. ఏడాది క్రితం నాగన్న అనారోగ్యం తో మృతి చెందగా, తల్లిదండ్రులు కట్టించిన ఇంట్లో పెద్ద కొడుకు శంకర్ ఉన్నా అన్నం పెట్టకపోవడంతో అదే ఇంట్లో తల్లి లక్ష్మీదేవ మ్మ విడిగా ఉంటూ కూలి నాలీకి చేసుకుంటూ బతుకుతోంది. చిన్న కొడుకు అదే ఊర్లో అద్దె ఇంట్లో ఉంటూ.. పదిరోజుల క్రితం రైతు భరోసా డబ్బుల కోసం వచ్చి బెదిరించి కొట్టి వెళ్లాడు. తాజాగా పీ ఎం కిసాన్ డబ్బులు తల్లి అకౌంట్లో పడ్డాయన్న విషయం తెలిసి పెద్ద కొడుకు శంకర్ డబ్బులు ఇవ్వమని శనివారం అడిగాడు. భూ మి అనుభవిస్తున్నందుకు రూపాయి ఇవ్వరూ.. పైగా ఈ డబ్బులు కూడా మీకే ఇస్తే నేనెలా బతకాలని వాదించింది. తల్లిపై గొడ వపెట్టుకుని కర్రతో దాడి చేయడంతో తలకు రక్తగాయమైంది. ఆమెను భర్త తమ్ముని కుమారుడు వెంకట్రాముడు కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

మిడ్జిల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన రాఘవేందర్(35) పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీని వాసులు శనివారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వివరాల ప్రకా రం.. రాఘవేందర్ శుక్రవారం తన వ్యవసాయ పొలం వద్ద పురుగు ల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యుల కు ఫోన్‌ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. కుటుంబ స భ్యులు అక్కడికి వెళ్లే సరికి రాఘవేందర్ పురుగుల మందు తాగి ఉండటం గమనించి వెంటనే చికిత్సకై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాఘవేందర్ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టెబు ల్ శ్రీనివాసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

మిడ్జిల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సంపంగి ఈశ్వర్‌వర్మ భార్య మానస శనివారం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టెబుల్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం 11 గంటల ప్రాంతంలో పని నిమిత్తం బయటకు వెళ్లిన ఈశ్వర్‌వర్మకు భార్య ఫోన్‌చేసి ఎక్కడున్నావని అడిగింది. 12గంటల ప్రాంతంలో తన భార్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానం వచ్చిన ఈశ్వర్‌వర్మ ఇంటికి రావడంతో తన నాలుగు నెలల బాలుడు ఇంటివద్దే కనిపించాడు. భార్య కనిపించకుండాపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద సమాచారం రాకపోవడంతో వెం టనే తమకు ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తె లిపారు. కాగా ఈశ్వర్‌వర్మ, మానసలది ప్రేమ వివాహమని తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని పేర్కొన్నారు.

వ్యాపారం.. రోడ్డెక్కుతోంది!

- ప్రధాన రహదారికి అనుసరించి షాపులు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు
- మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- ఇరుకుగా మారుతున్న శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి



ఎడమ పాతాళగంగలో రోడ్డు పక్కనే ఉన్న షాపులు

బ్రహ్మగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి ఇరుకుగా మారుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు స్థానిక వ్యాపారులు కిరాణ షాపులు, హోటళ్లు ఒకరికి మించి మరొకరు పోటీపడి ప్రధాన రహదారికి అనుసరించి నిర్మాణాలు చేస్తుండటంతో వాహనాలు నిలిచిపోయి గంటల తరబడి యాత్రికులు నిరీక్షించాల్సి వస్తున్నది. ఎన్‌హెచ్‌ఏ నిబంధనల ప్రకారం శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి 100 అడుగులు కాగా, ప్రస్తుతం నిర్మాణం చేసిన రోడ్డు 23 అడుగులు ఉంది. రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా 50 అడుగుల వరకు రోడ్డు స్థలం వదిలేసి నిర్మాణాలు చేసుకోవాలని, గతంలో ముందుకు వచ్చి నిర్మాణాలు చేసిన ఇళ్లకు 30 సంవత్సరాల క్రితమే ఎన్‌హెచ్‌ఏ శాఖ అధికారులు మార్కింగ్ చేశారు. అయినా వ్యాపారస్థులు మన్ననూర్, వటువర్లపల్లి, బ్రహ్మగిరి, పాతాళగంగ గ్రామాల్లో ఐదు అడుగుల దూరం కూడా లేకుండా షాపులు నిర్మించుకున్నారు. కాగా, వ్యాపారానికి సంబంధించిన బోర్డులు, హోర్డింగ్‌లు జాతీయ రహదారికి పక్కవెంట ఏర్పాటు చేస్తుండటంతో వాహదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రమాదాలకు కారణం..

మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు 78 కిలో మీటర్లు పూర్తిగా మలుపులతో కూడిన ఘాట్ రోడ్డు కావడంతో వాహనాలు చాలా దూరం ప్రయాణం చేస్తుంటాయి. సక్రమంగా స్పీడ్‌బ్రేక్‌లు లేకపోవడం, గ్రామాల్లో రోడ్డును అనుసరించి షాపులు ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా వటువర్లపల్లి నుంచి పాతాళగంగ, సుండిపెంట, శ్రీశైలం వరకు ఎక్కువగా ఇరుకైన ఘాట్ రోడ్డు ఉండటంతో వాహనాలు ఢీ కొనడం, అదుపు తప్పి బోల్తా పడటం వలన నిత్యం ప్రమాదాలకు నిలయంగా శ్రీశైలం ఘాట్ రోడ్డు మారింది. దీనంతటికీ కారణం రోడ్డు ఇరుకుగా ఉండటం అని, నాయకులు, అధికారులు స్పందించి ముఖ్యంగా గ్రామాల్లో రోడ్డు విస్తరణ చేపట్టాలని వివిధ గ్రామాల ప్రజలు, శ్రీశైలం వచ్చి పోయే యాత్రికులు కోరుతున్నారు.

రోడ్డు స్థలం వదిలేసి నిర్మాణం చేసుకోవాలి

శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి సెంటర్ నుంచి 50 అడుగులు ఇరువైపులా వదిలేసి వ్యాపారులు నిర్మాణాలు చేసుకోవాలి. మన్ననూర్ నుంచి పాతాళగంగ వరకు రోడ్డుకు అనుసరించి కట్టిన షాపులను తొలగించేందుకు నోటీసులు ఇస్తాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

- రమేశ్, డీఈ, ఎన్‌హెచ్‌ఏ కల్వకుర్తి డివిజన్

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్ రెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో పెరిగిపోతున్న అసమానతలు, ప్రజా సమస్యల పరిష్కానికి ప్రజా పోరాటాలకు ప్రజలంతా సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా మహాసభలు శనివారం రెండోరోజు జరిగాయి. స్థానిక శుభం గార్డెన్‌లో శనివారం ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఎర్రజెండా అండగా ఉంటుందని, ఆది నుంచి ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ముందుండి పోరాటం చేసిందన్నారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీని ఎవ్వరు అణిచివేయాలని చూడలేదన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే సీపీఐ సహించబోదని, మత రాజకీయాలను ప్రోత్సహించకుండా లౌకిక వాదులతో కలిసి నిరోధిస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన సమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నరింహ, సీపీఐ నాయకులు ఆనంద్, ఫయాజ్, కేశవులు గౌడ్, అనిల్ కుమార్, నర్సింహ, ఏసు, విజయుడు, ఇందిరమ్మ, చంద్రమౌళి, కొమ్ము భరత్, పులిజాల పరుశరాములు, డాక్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ నూతన కార్యదర్శిగా ఫయాజ్



ఎస్ ఎండి ఫయాజ్

నాగర్‌కర్నూల్ జిల్లా సీపీఐ కార్యదర్శిగా ఎస్ఎండీ ఫయాజ్ ఎన్నికయ్యారు. సీపీఐ జిల్లా మూడవ మహాసభలలో భాగంగా కల్వకుర్తి పట్టణంలో శుభం ఫంక్షన్ హాలులో శనివారం రెండవ రోజు ప్రతినిధుల సభలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్‌తో పాటు హెచ్ ఆనంద్, జి.వార్ల వెంకటయ్య, కే కేశవులుగౌడ్, టి.నర్సింహ, ఈర్ల చంద్రమౌళి, కే యేసయ్య, హెబ్బేటి విజయుడు, కొమ్ము భరత్, ఆర్.ఇంద్రమ్మలను జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజల సంక్షేమం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు

(5వ పేజీ తరువాయి...)

ముంపు ముప్పు లేకుండా సుమారు 60 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని, మీ సహకారం కూడా కావాలని ఉప ముఖ్యమంత్రి ని కోరారు. శ్రీశై లం ప్రాజెక్టు ముంపు బాధితులకు 98 జీవో ద్వా రా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉండే కానీ అది నెరవేరలేదని, వారికి కనీసం పం చాయతీ సెక్రటరీ లేదా లష్కర్ ఉద్యోగాలు ఇవ్వా లని, లేకపోతే ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో లైబ్రరీల అభివృద్ధికి కోటి రూపాయలు ఇస్తానని ప్రకటించి న ఎంపీ మల్లు రవికి ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృతజ్ఞతలు తెలిపా రు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. తెలంగాణ ఏర్పడకముందు రూ.75వేల కోట్ల అప్పు ఉంటే పదేండ్ల పాలనలో రూ.8 లక్షల కోట్ల అప్పు అయిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన దా ఖలాలు లేవని ఎద్దేవా చేశారు. ఇంకా చేయాల్సింది చాలా ఉందని, వాట న్నింటిని అమలు చేసి తీరుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆ తరువాత రైతులకు రూ.10 కోట్ల విలువైన విద్యుత్ సామగ్రి , నియంత్రికలను పంపిణీ చేశారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, రేషన్ కార్డులను అంద జేశారు.



రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి

అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత ఆర్టీసీ ప్రయాణానికి రూ.6,680 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని తద్వారా ప్రజలకు ఆర్టీసీతో పాటు ప్రభుత్వానికి లాభం చేకూరిందని తెలిపారు. గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దయ్యాలకు ,భూతాలకు అవకాశం ఇవ్వొద్దని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం గద్వాల మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సరిత తిరుపతయ్య, పిసిసి ఉపాధ్యక్షులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, వివిధ మం డలాల మాజీ ప్రజాప్రతినిధులు అల్లాపూర్ మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు సంబంధిత శాఖల అధికారులు, కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు , ప్ర జాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చేపలు పులుసు, చికెన్‌పై తినడానికి రాలే..

- ప్రభుత్వ పథకాలు వివరించేందుకు వచ్చా
- కాంగ్రెస్ నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీ మల్లురవి



సభలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి

కొల్లాపూర్, (ఆంధ్రజ్యోతి): తాను కొల్లాపూర్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు పెట్టిన చేప పులుసు, చికెన్‌పై తినడానికి రాలేదని ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించేందుకు వచ్చానని నేను మాట్లాడుతుండగా ఆపమనడానికి నువ్వు ఎవరంటూ కాంగ్రెస్ నాయకుడిపై నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ జరిగిన ఉపముఖ్యమంత్రి సభలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ఎంపీ మల్లు రవి ప్రసంగిస్తుండగా ఆపాలని పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దండు నరసింహ చిట్టి రాసి ఇచ్చారు. దీంతో ఒకసారిగా మల్లు రవి కోపోద్రిక్తులై నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సొల్లు మాట్లాడటం లేదని, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల గురించి మాట్లాడుతున్నానని, తనను ఆపమని చెప్పడానికి నువ్వు ఎవరు అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ జూపల్లి ఇలాంటి వారిని తన దగ్గరకు రాకుండా చూడండి అంటూ మల్లు రవి చెప్పారు. ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో మీటింగ్ ఉన్నా ఇక్కడి సభకు వచ్చినట్లు చెప్పారు. కాసేపటి తరువాత తన ప్రసంగాన్ని ముగించారు.

సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసేందుకు జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం సోమశిల తెలంగాణ టూరిజం గెస్ట్ హౌస్ వద్ద జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో పొరపాట్లకు తావు లేకుండాని జమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రాత్రి సోమశిల గ్రామంలో మృగవాని కాటేజీలలో ఉపముఖ్య మంత్రి రాత్రి బస చేసి ఆదివారం ఉదయం రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తిరు గు ప్రయాణం కానున్నారు.



జిల్లా రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి

స్నేహం కోసం..

మధురమైనది మిత్రబంధం




స్నేహానికి ఎల్లలు లేవు. నిజమైన మిత్రులకు మించిన ఆస్తి లేదు. మంచి మిత్రుడు తోడుంటే ఆయుధం ధరించిన భరోసా ఉంటుంది.. స్నేహ బంధం ప్రతిఫలాన్ని ఆశించని మొగ్గలా ప్రారంభమై మహా వృక్షంగా ఎదిగి జీవితాంతం తోడు నిస్తుంది. కన్నవారితో, కట్టుకున్న వారితో, తోడ బుట్టిన వారితో, చెప్పుకోలేని విషయాలను మిత్రులతో చెప్పుకోవడం మిత్రుత్వ గొప్పతనం. జీవితమనే ఉద్యాన వనంలో అందమైన పుష్పం స్నేహం. ఇచ్చింది మరచి పోవడం.. పుచ్చుకున్నది జ్ఞాపకం ఉంచుకోవడమే స్నేహమని ఓ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ పేర్కొన్నారు. ఆగస్టు నెల మొదటి ఆదివారం ఈనెల 3న ప్రపంచ స్నేహితుల దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే) జరుపుకుంటారు. ఈ సందర్భంగా స్నేహితుల చేయూత, సామాజిక సేవా కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా దేశ, విదేశాల నుంచి మిత్రుల మధురస్మృతులు, సాధక బాధకాలు పంచుకుంటూ.. సాగిస్తున్న చాటింగ్‌పై ప్రత్యేక కథనం మీకోసం..

– నారాయణపేట/అచ్చంపేటటౌన్ (ఆంధ్రజ్యోతి)



భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులు



- ఆపదలో ఆదుకుంటూ చేయూతనిస్తోన్న స్నేహితులు
- పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో మిత్ర సంఘాలు
- సామాజిక మాధ్యమాలతో చిన్ననాటి జ్ఞాపకాల నెమరు..

నేడు ప్రపంచ

స్నేహితుల దినోత్సవం

స్నేహ మిత్రమండలి

ప్రతీ ఏటా రక్తదాన శిబిరాలు నిర్వర్తిస్తూ...

నారాయణపేటలో డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 1985-87లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన దోస్తులు 116 మంది కలిసి 2005లో స్నేహ మిత్రమండలి స్థాపించుకున్నారు. తోటి మిత్రులు ఒక్కొక్కరు ఒక్కో వృత్తిలో స్థిరపడినా తరచుగా కలుసుకుంటారు. ప్రతీ ఏటా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి సామాజిక బాధ్యతను చాటుతారు. తొమ్మిది ఏళ్లగా రక్తదాన శిబిరాలు నిర్వహించి ఇప్పటివరకు 476 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుకు అందించారు. అకాల మరణం చెందిన మిత్రమండలి సభ్యుల కుటుంబాలకు చేయి చేయి కలిపి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు.

హిందూ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నారాయణపేటలో వివిధ పాఠశాలల్లో చదివిన 1090-91 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులతో 1991లో హిందూ ఫ్రెండ్స్ అసోసియేషన్‌ను స్థాపించారు. అధ్యక్షుడు ప్రవీణ్ మాంద్రే ఆధ్వర్యంలో కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏటా గణేష్, కృష్ణాష్టమి, రక్షాబంధన్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2018లో ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలని పోలీసుల సహకారంతో అవగాహన కార్యక్రమం చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా 2019లో శ్యాసన్‌పల్లి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. తోటి మిత్రులకు ఏ ఆపద వచ్చినా మిత్ర బృందంలోని సభ్యులు అంతా ఏకమై తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారు.

గెట్ టు గెదర్

చిన్నప్పటి దోస్తులను కలవాలంటే పేరంటాలు.. లేదంటే ఊరి జాతరలే వేదికలయ్యేవి. ఇవి కూడా ఎప్పుడో ఒకసారి జరిగేవి. కానీ గత ఐదారేళ్లలో చిన్నప్పటి స్కూల్ ఫ్రెండ్స్ అంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించుకోవడం పెరిగిపోయింది. దీనికి ప్రధాన కారణం వాట్సాప్ గ్రూపులే. ఒకరు పరిచయమైతే చాలు వారం, పది రోజుల్లోనే ఒకరి తర్వాత ఒకరి కాంటాక్ట్ నంబర్లు సాధించడం, అందరినీ గ్రూపుల్లో చేర్చడం చకచకా జరిగిపోతున్నాయి. బిజీ లైఫ్‌లో పరుగెత్తే మనిషికి చిన్ననాటి దోస్తులు వాట్సాప్ గ్రూపుల్లో అరేయ్, ఒరేయ్ అని పిలుస్తుంటే వయస్సు ఒక్కసారిగా తగ్గిపోయినట్లు అనిపిస్తోంది. పాఠశాల రోజుల్లో చేసిన అల్లర్లు గుర్తుచేసుకుంటూ, అప్పటి ముద్దుపేర్లతో ఆటపట్టిస్తుంటే ఆ వ్యక్తి జీవితంలో స్ట్రెస్ బూస్టర్‌గా మారుతోంది. అంతటితో ఆగనివాళ్లు మరో అడుగు ముందుకేసి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆపదలో ఉంటే ఆదుకునేందుకు వాట్సాప్ గ్రూప్ వేదికగా మారింది. గ్రూపులో చర్చకు పెట్టడం, సాయం చేయాలని నిర్ణయించుకోవడం, ఆ తర్వాత ఒక్కొక్కరుగా యూపీఐ పేమెంట్లు ఒకరికి చేయడం, ఆ వ్యక్తి వెళ్లి ఇబ్బంది పడుతున్న దోస్త్‌కు సాయం అందించడం వంటివి వెనువెంటనే జరిగిపోతున్నాయి.

భీష్మరాజ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

నారాయణపేట ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్‌లో 1996-97 పదోతరగతికి చెందిన స్నేహితులంతా కలిసి భీష్మరాజ్ ఫౌండేషన్‌గా ఏర్పడి చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయాల అభివృద్ధి, పేటలో సీసీ కెమెరాల ఏర్పాటు, బడిబాట పట్టేలా విద్యార్థులను చైతన్యం చేయడం, నిరుపేదలకు ఆర్థికంగా చేయూతనందిస్తున్నారు. మొక్కలునాటి పచ్చదనం పెంపొందించడం, నిరుద్యోగులు ఉద్యోగ మేళాలు నిర్వహించడం, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు వేయించడం, ప్రతిభావంతులకు అండగా నిలిస్తూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నారు. పద్మభూషన్ అవార్డు గ్రహీత దామరగిద్ద దాసరి కొండప్పకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు.



మిఠాయి తినిపించుకుంటున్న స్నేహితులు

ముందస్తు సంబురాలు

అయిజ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ముందస్తు సంబురాలను పులికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ఉల్లాసంగా జరుపుకున్నారు. ఆదివారం పాఠశాలలకు సెలవు కావటంతో ఒక రోజు ముందస్తుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ సంబురాలు చేసుకున్నారు. చేతులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని, టిఫిన్‌లు ఒకరికొకరు తినిపించుకుంటూ సందడి చేశారు.



పేటలో స్నేహమిత్ర మండలి సభ్యులు

వారధిగా నిలుస్తోంది



10వ తగరతి వరకు నాగర్‌కర్నూల్‌లో చదువుకున్నాం. అప్పట్లో ఫోన్‌లు లేవు. ఆ తర్వాత పైచదువులు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయాం. 2015 తర్వాత వాట్సాప్ ద్వారా పదవ తరగతి, ఇంటర్‌తో పాటు పైచదువులు చదివిన స్నేహితులను కలుసుకున్నాం. నిత్యం ఇప్పుడు ఎవరు ఎక్కడ ఉన్నారు అని చాట్ చేసుకుంటూ ఉంటాం. ఆపద వస్తే ఫెండ్స్ అందరం కలిసి డబ్బులు వేసుకొని సహాయం చేస్తుంటాం.

– రాము, నాగర్‌కర్నూల్

క్రైం కార్నర్

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

» 220 గ్రాముల గంజాయి ప్యాకెట్ల పట్టివేత



గంజాయితో పట్టుబడిన వ్యక్తులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి గంజాయి ప్యాకెట్‌లను తీసుకువచ్చి పాలమూరులో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి వివరాల ప్రకారం ఎక్సైజ్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శనివారం తెల్లవారుజామున బైపాస్ రహదారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా టీజీ 12బి 5057 వాహనంపై వచ్చిన హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు మహ్మద్ రియాజ్, సయ్యద్ అబ్దుల్ హుస్సేన్‌ల దగ్గర గంజాయి ప్యాకెట్‌లు లభించాయి. వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. హైదరాబాద్‌నుంచి చిన్నచిన్న గంజాయి ప్యాకెట్‌లను తీసుకొచ్చి పాలమూరులో విక్రయిస్తామని చెప్పారు. వీరి వద్ద 220 గ్రాముల ఎండు గంజాయి లభించింది. వీరిని న్యాయస్థానంలో న్యాయాధికారి ముందు హాజరుపరచగా, రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో పాల్గొన్న అధికారులను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు. జిల్లా గంజాయి సరఫరా, వినియోగంపై నిఘా ఏర్పాటు చేశామని, అన్ని బ్లాక్ స్పాట్‌లపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీకొని వ్యక్తి మృతి

» మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కోస్గి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కారు-ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని కడంపల్లి గేటు సమీపంలో చోటుచేసుకుంది. శనివారం ఏఎస్సై ఆంజనేయులు తెలిపిన కథనం మేరకు.. కోస్గికి చెందిన నవీన్, శివకుమార్, వికారాబాద్ జిల్లా పద్మారంకు చెందిన మహేష్(28) ముగ్గురు శుక్రవారం రాత్రి 11 గంటలకు గుండుమల్ వైపునుంచి కోస్గికి వస్తున్నారు. కోస్గి నుంచి నారాయణపేటకు వెళుతున్న కారు కడంపల్లి గేటువద్ద వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయాలపాలైన నవీన్, శివకుమార్‌ను కోస్గి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. కాగా, మృతుడు కోస్గిలో బియ్యం వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. వీరు ఇరువురు స్నేహితులుగా ఉండేవారని వారితో కలిసి గుండుమల్ వెళ్లి వస్తుండగా ఘటన జరిగిందని తెలిపారు. ఈ విషయంపై మృతుని అన్న ఉప్పు వెంకటేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

ప్రీ ప్రైమరీ టీచర్స్‌గా తీసుకోవాలి

» ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సీతక్కను కలిసిన అంగన్‌వాడీ టీచర్లు

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్‌ను ప్రీ ప్రైమరీ టీచర్స్‌గా తీసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, అనసూయను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి ప్రభుత్వం త్వరలో తేబోతున్న ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాల నిర్వహణ కోసం అంగన్‌వాడీ టీచర్లను తీసుకోవాలని మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా అంగన్‌వాడీ ఉద్యోగులు మాట్లాడుతూ... గత 50 సంవత్సరాలుగా అంగన్‌వాడీ ఉద్యోగులుగా గౌరవ వేతనంతో పని చేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా అనేక అదనపు ప్రభుత్వ కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలల నిర్వహణకు వేరే వలంటీర్లను నియమించడం కోసం జీవోను తెచ్చిందని, దానిని వెంటనే రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు డిగ్రీలు, పీజీలతో పాటు ప్రీ స్కూల్ శిక్షణ, జాబ్‌కోర్సు ఆర్పీ ట్రైనింగ్‌లు, ప్రీ స్కూల్ కార్యక్రమాల మీద పూర్తి అవగాహన ఉన్నందున అర్హులైన అంగన్‌వాడీ ఉద్యోగులను నియమించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి తదుపరి కార్యాచరణను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు సౌదామిని, ఇందిరమ్మ, శ్రీలత, అనంతలక్ష్మి, సువర్ణ, వెంకటలక్ష్మి, శైలజ, సుజాత తదితరులు ఉన్నారు.



మంత్రి సీతక్కతో ప్రీ ప్రైమరీ టీచర్స్‌గా నియమించాలని కోరుతున్న అంగన్‌వాడీ టీచర్లు

రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

» అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ (ఏడీఆర్) డాక్టర్ రాంప్రకాశ్

బిజినేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలను వినియోగించుకొని అధిక లాభాలను అర్జించాలని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ రాంప్రకాశ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెంలోని ఏజీ కాలేజీ ఆడిటోరియంలో శనివారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులను రైతుల ఖాతాలో జమపై, వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులతో కలిసి వీక్షించి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు వస్తున్న విప్లవాత్మక మార్పులను, సాగు అవసరాలను సులభతరం చేసేందుకు వినియోగించు కొని పెట్టుబడి ఖర్చులను, శారీరక శ్రమ, సమయాలను తగ్గించుకొని అధిక ఆదాయం పొందాలని సూచించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, ఏడీఏ పూర్ణచంద్రా రెడ్డి, ఇన్‌చార్జి ఏవో కమల్ కుమార్, దేశీ ప్రోగ్రాం ఫెసిలిటేటర్ కృష్ణయ్య, ఆర్‌ఏఆర్‌ఎస్, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు, రావేఫ్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



పాలెం ఏజీ కాలేజీలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ రాంప్రకాశ్

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ధన్వాడ విద్యార్థినులు

ధన్వాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడకు చెందిన నాగలక్ష్మి, గీత అనే విద్యార్థినీలు జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో నాగలక్ష్మి, గీత పాల్గొని 23 విభాగంలో 55 కేజీల బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా వారికి నిర్వాహకులు ప్రశంసాపత్రం అందించారు. ఈనెల 21 నుంచి 24 వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నారని కోచ్ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను డీవైఎస్‌వో వెంకటేష్, ఊసు రవికుమార్, సాయినాథ్‌లు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని కోరారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న నాగలక్ష్మి, గీత

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ పోటీలకు జడ్చర్ల విద్యార్థులు

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు సిద్దిపేట జిల్లాలో జరిగే ఫుట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు జడ్చర్ల విద్యార్థినులు ఎంపికయ్యారు. గత నెల 9న నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో జిల్లా జట్టుకు బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు పూజ, హిందు, వైష్ణవిలు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ విభాగంలో ఎంపికైన విద్యార్థినులను పీడీలు రాంకల్యాణ్‌జీ, వడెన్న, ఉపాధ్యాయులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన జడ్చర్ల విద్యార్థినులు

నేడు కవులు, రచయితల డైరీ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లా కవులు, రచయితల 2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజామైనొద్దీన్, కొప్పోలు యాదయ్య, ప్రచార కార్యదర్శి ప్రమోద్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి కెఆనంద్ చారి, విశిష్ట అతిథులుగా జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది మనోహర్ రెడ్డి, వల్లభాపురం జనార్దన, ఆత్మీయ అతిథిగా విజేత వెంకట్ రెడ్డిలు హాజరవుతరన్నారని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి కవులు, రచయితలు, సాహితి అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుటుంబ సభ్యుల వద్దకు చేరిన తప్పిపోయిన మహిళ

ఊట్కూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళను ముంబయికి చెందిన శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు శనివారం ఊట్కూర్‌లో కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. ఊట్కూర్ పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. ఊట్కూర్‌కు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు మంజూర్ అహ్మద్ భార్య సబియా బేగంకు గత కొన్నేళ్ల నుంచి మతిస్థిమితం సరిగాలేదు. ఈ క్రమంలో ఆమె ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే మళ్లీ ఎప్పటిలాగే తిరిగి వస్తుందని కుటుంబ సభ్యులు ఎక్కడా కూడా ఫిర్యాదు చేయలేదు. అయితే గత నెల మొదటి వారంలో గుజరాత్ రాష్ట్రంలో స్థానిక శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులకు కనిపించడంతో ఆమెకు ఆశ్రయం కల్పించి వివరాలు సేకరించారు. అనంతరం ముంబయి ఫౌండేషన్ సభ్యులకు అప్పగించడం, వారు అక్కడి నుంచి ఆమెను నేరుగా ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకోరావడం జరిగింది. అనంతరం పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి వారి కుటుంబ సభ్యుల వివరాలు చెప్పడంతో పోలీసులు భర్త మంజూర్ అహ్మద్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం భర్త పోలీస్‌స్టేషన్‌కు రావడంతో పోలీసుల సమక్షంలో సబియాబేగంను భర్తకు అప్పగించారు. ఊట్కూర్ ఎస్సై రమేష్, ఫౌండేషన్ సభ్యురాలు ఎస్.అస్వతీ బృందం, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు

అమ్మమ్మ మృతితో అనాథ అయిన బాలిక

వీపనగండ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆలనా పాలనా చూసే అమ్మమ్మ మృతి చెందడంతో అనాథ అయిన బాలికకు అండగా మే ముంటామని భరోసా ఇచ్చారు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు. వనపర్తి జిల్లా వీపనగండ్లలో శుక్రవారం అమ్మమ్మ వడ్డె బాలకి ష్టమ్మ మృతి చెందడంతో మనవరాలు అలివేల అనాథ అయింది. కల్వరాల గ్రామానికి చెందిన ఆ బాలిక తల్లిదండ్రులు కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో ఒకరి తరువాత ఒకరు మృతి చెందారు. ఆనాటి నుంచి అమ్మమ్మ దగ్గర ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. అమ్మమ్మ కూడా మృతి చెందడంతో ఆ బాలిక అనాథ అయింది. విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు సీడీపీవో బాలీశ్వరమ్మ తమ బృందంతో వెళ్లి వీపనగండ్లలో ఉన్న ఆ బాలికను పరామర్శించి తామున్నా మని ధైర్యం చెప్పారు. బంధువులతో మాట్లాడగా చిన్నమ్మ సంధ్య తన దగ్గర ఉంటుందని, తాను చూసు కుంటానని తెలిపారు. మీకు వీలు కాకపోతే బాలసదనం సేవలు స్పాన్సర్ షిప్ పథకం ద్వారా బాగోగులు చూసుకుంటామని రాంబాబు తెలిపారు. ఏ అవసరం ఉన్నా తమను సంప్రదించాలని బాలికకు తెలిపారు. సూపర్‌వైజర్ నారాయణమ్మ, డీసీపీయూ సిబ్బంది నరేందర్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

● ఆసుపత్రి ముందు ఆందోళన

కల్వకుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సాబేర్ (45) గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం అర్ధరాత్రి అతనికి ఛాతిలో నొప్పి రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుక వెళ్లారు. ఆసుపత్రిలో ఈసీజీ తీసిన డ్యూటీ డాక్టర్ పరిస్థితి బాగానే ఉందని మందులిచ్చి పంపాడు. దాంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. తెల్లవారు జామున గుండెపోటు రావడంతో అతడు మరణించాడు. దీంతో కుటుంబ సభ్యులు ఈసీజీ తీసినప్పుడు తేడా ఉందని చెబితే హైదరాబాద్‌కు తీసుకవెళ్లే వారమని శనివారం ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని వీరన్నపేటలో గల రవూఫ్ బాబా ఉర్సులో భాగంగా శనివారం గంధోత్సం నిర్వహించారు. చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు.

ఆటో మొబైల్స్ దుకాణంలో సోదాలు

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని ఎంబీ మెడికల్ సెంటర్ సమీపంలో ఉన్న రాందేవ్ ఆటో మొబైల్స్ దుకాణంలో శనివారం జడ్చర్ల సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. సుమారు రూ.3 లక్షల విలువ గల వస్తువులు అనుమానాస్పదంగా ఉన్నాయని, సంబంధిత కంపెనీల ప్రతినిధులతో పరిశీలన అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు విస్తరణకు భూమి పరిశీలన

భూత్పూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్ నుంచి నాగకర్నూల్‌కు వెళ్లే జాతీయ రహదారి గోప్లాపూర్ గ్రామం వద్ద కిలో మీటరు మేర రోడ్డు విస్తరణ పనులకు శనివారం మండల సర్వేయర్ రోడ్డు విస్తరణకు అవసరమయ్యే 60 ఫీట్ల భూమిని పరిశీలించారు. సర్వే చేసి ఎంత భూమి పోతుంది? అనే విషయాన్ని త్వరలో వెల్లిండిచనున్నట్లుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కీ నవీన్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే చెక్‌డ్యాం నిర్మాణం

మిడ్జిల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లేకుండా కేవలం కమిషన్ల కోసమే వాగుపై చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వస్పుల గ్రామంలోని దుందుబీ వాగుపై ఆరేళ్ల కిత్రం నిర్మించిన చెక్‌డ్యాం కుంగడంతో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

భూత్పూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని తాటిపర్తిలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ఆయన భూమిపూజ చేశారు. అంతకుముందు మండలంలోని అన్ని గ్రామాలకు మంజూరైన వీధి దీపాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి, తమ్మన్న గౌడ్, పుల్లయ్య పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ 11వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 26వ వార్డు పరిధిలోని 16 మందికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. అంతకుముందు తన తల్లి శశికళ జన్మదినం సందర్భంగా తల్లితో పాటు సోదరుడు దుష్యంత్‌రెడ్డితో కలిసి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్ జ్యోతి కృష్ణారెడ్డి, నాయకులు మాలిక్‌షాకీర్, నిత్యానందం, కమిషనర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

కోయిలకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సాంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ధర్మ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆది ఆంజనేయస్వామి ఆలయంలో రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షా బంధన్ కార్యక్రమంలో మాట్లాడారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి

గండీడ్/రాజాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతోందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లమ్మ అన్నారు. శనివారం మండలంలోని సల్కర్‌పేట్, వెన్నాచేడ్, కొండాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవం జరుపుకున్నారు. రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

అతిథి అధ్యాపకులకు అవకాశం

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు అతిథి అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ కోర్సులో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తామని, ఈనెల 5 లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, ఈనెల 6న ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

గండీడ్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ అంతమే పీఆర్టీయూ లక్ష్యమని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్ యాదవ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెన్నాచేడ్ బాలుర, ఆదర్శ పాఠశాల, గండీడ్ బాలుర ఉన్నత పాఠశాల, సల్కర్‌పేట్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు.

విద్యార్థులకు అసౌకర్యం కలుగొద్దు

▸ కలెక్టర్ విజయేందిర బోయి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

భూత్పూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పాఠశాలతో పాటు హాస్టల్ గదుల్లో ఎలాంటి అసౌకర్యాలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్‌తో పాటు సంబంధిత అధికారులకు కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. శనివారం భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ గ్రామ శివారులో ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం, స్నాక్స్ వంటి నాణ్యమైనవిగా ఉన్నాయా? ఏమైన ఇబ్బందులు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు.

బోయపల్లి పాఠశాల పరిశీలన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : జిల్లా కేంద్రంలోని బోయపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలను శనివారం కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. తెలంగాణ మోడల్ స్కూల్ ఎంపిక విషయంలో పరిశీలించారు.

100 శాతం ఫలితాలు సాధించాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శనివారం ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, 80 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులతో వెబెక్స్ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు, పరీక్ష భయం, వారిపై వారికి నమ్మకం లేకపోవడం వంటివి ఉందని, విద్యార్థులకు అర్థమయ్యేలా వారికి పాఠ్యాంశాలు నేర్పించాలన్నారు. సెప్టెంబరు ఒకటి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్స్‌ను ఉపయోగించాలని, విద్యార్థులకు వండే ఆహారం గ్యాస్ స్టవ్‌పై మాత్రమే తయారు చేయాలన్నారు. పాఠశాలలో టాయిలెట్స్, సీసీ కెమెరాలు, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు, నిర్మాణం, పాఠశాల, జూనియర్ కళాశాలల భవన నిర్మాణ పనులు, భవిత సెంటర్లు తదితర వాటిపై సమీక్షించారు. డీఈవో ప్రవీణ్‌కుమార్, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ రామచంద్రం, సీఎంవో బాలుయాదవ్, ఏఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

నెలవారీ తనిఖీలో భాగంగా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ విజయేందిర బోయి శనివారం తనిఖీ చేశారు. గోడౌన్ సీల్‌ను, సీసీ కెమెరాల, భద్రత పరిశీలించి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేనిదే ఎవరినీ లోపలికి పంపిచొద్దని అధికారులను ఆదేశించారు. ఎన్నికల డీటీ జాఫర పాల్గొన్నారు.

జడ్చర్ల బైపాస్ ఏర్పాటుకు కృషి

▸ ఎంపీ డీకే అరుణ ▸ పార్టీలు వేరైనా అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణానికి అనుసంధానంగా ఉన్న 44, 167వ జాతీయ రహదారులకు అనుసంధానంగా బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కారికి ఎమ్మెల్యేలతో కలిసి ప్రతిపాదనలు అందజేసి బైపాస్ అవశ్యకత గురించి వివరించినట్లు ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం మండలంలోని వస్పుల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పీఎం శ్రీ నిధులు రూ.27 లక్షలతో మంజూరైన పాఠశాల అదనపు గదుల నిర్మాణం, సైన్స్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ఎంపీ డీకే అరుణ ప్రారంభించి, మాట్లాడారు. పార్టీలు వేరైనప్పటికీ అభివృద్ధికి సహకరిస్తున్న ఎంపీ అరుణ కృషి అభినందనీయమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. అనంతరం ఎంపీతో కలిసి వైద్య ఉపకేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మార్కెట్ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, తహసీల్దార్ పులిరాజు, ఎంపీడీవో గీతాంజలి, ఎంఈవో వెంకట య్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం తారాసింగ్ పాల్గొన్నారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల : కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో భాగస్వామ్యం ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి పాతబజారు సమీపంలోని రంగనాయకస్వామి గుట్టపై శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

హామీలు అమలు చేయని కాంగ్రెస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వోబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో న్యూగంజ్ మాజీ కౌన్సిలర్ పెద్ద నర్సింహులు, 80 మంది కార్యకర్తలు అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త ఇప్పటి నుంచే కష్టపడి పని చేయాలన్నారు. అంతకుముందు ఎంపీ పోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, నాయకులు రాములు, బాల్‌రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ రూరల్ : రైతు హితమే కేంద్ర ప్రభుత్వ అభిమతమని ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం రూరల్ మండలం ధర్మపూర్‌లోని రైతు వేదికలో ప్రధాని మోదీ నిర్వహించిన పీఎం కిసాన్ సమ్మాన్ లైవ్ ప్రోగ్రాంను రైతులతో కలిసి వీక్షించారు.

ప్రతిభ గల క్రీడాకారులకు ఎండీసీఏ చేయూత




క్రీడాకారులకు సైకిళ్లు అందజేసిన రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి భ గల క్రీడాకారులకు ఎండీసీఏ (మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్) చేయూత అందిస్తుందని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని ఎండీసీఏ మైదానంలో క్రికెట్ క్రీడాకారులు నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్‌కు చెందిన జశ్వంత్, పాలెంకు చెందిన గగన్, అచ్చంపేటకు చెందిన రాంచరణ్‌కు అసోసియేషన్ తరుపున సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో జరిగిన ఇంట్రాడిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు క్రీడాకారులను గుర్తించి, వారికి సైకిళ్లు అందజేసినట్లు తెలిపారు. ఈ క్రీడాకారులకు సంఘం ఆధ్వర్యంలో ఓ ప్రవేట్ హాస్టల్‌లో వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఒక్కోక్కరిపై ఏడాదికి రూ.1.50 లక్షలు ఖర్చు ఎండీసీఏ భరిస్తుందన్నారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

31న శతాబ్ది ఉత్సవాల పూర్వ విద్యార్థుల సమావేశం

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 31న పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బాదిమి రవిశంకర్ తెలిపారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబరు 27, 28, 29 తేదీల్లో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. అందులో భాగంగా పూర్వవిద్యార్థులతో ఈనెల 31న పట్టణంలోని చంద్రాగార్డెన్స్‌లో సన్నాహక సమావేశంను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, కమిటీ సభ్యులు వెంకటరమణాచార్యులు, ఇబ్రహీం, గోపాల్, బాలకృష్ణ, వెంకటేశ్, సత్యం, టైటస్, శ్రీనివాస చారి, జయప్రకాశ్, ప్రకాశ్, సంతోష్‌చారి, ఆనంద్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, కర్షకులు పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు, కర్షకులు, పేదలు చైతన్యవంతులై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మీ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ కళా భవనంలో రెండు రోజుల పాటు కొనసాగనున్న సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను నేడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, కురుమూర్తి, తెలుగుసత్తయ్య, చంద్రకాంత్, రాజ్‌కుమార్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ పరిధిలో గొర్రెల సంత

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో గొర్రెల సంత ఏర్పాటు చేసేందుకు పాలకవర్గం సభ్యులు చర్చించారు. జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణమాసంలో జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో నిర్వహించే పోచమ్మ, బంగారు మైసమ్మ, ఎల్లమ్మ బోనాల పండుగలు, వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వహించే నిమజ్జనం ఏర్పాట్ల అంశంపై చర్చించారు. నూతనంగా ఎక్స్‌కవేటర్, వైకుంఠ రథం కొనుగోలు చేయాలని సభ్యులు తీర్మాణం చేశారు. మునిసిపాలిటీలో పశువుల సంత మాదిరిగా గొర్రెల సంత ఏర్పాటు అంశంపై చర్చించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, చైతన్యచౌహాన్, బుక్క మహేష్, జ్యోతి, శ్రావణిశ్యామ్, సతీష్ పాల్గొన్నారు.

అడ్డాకుల ఏపీఎంగా మహేష్

మూసాపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి ఏపీఎం గా పనిచేస్తున్న మహేష్ శనివారం అడ్డాకుల ఐకేపీ ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏపీఎం సుధీర్ భూత్పూర్‌కు బదిలీపై వెళ్లారు. మండల వీవోఏ యూనియన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మూసాపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని హెచ్‌ఎం శోభారాణి పేర్కొన్నారు. అడ్డాకుల మండలం పెద్దమునగాల్‌చేడ్ యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన గ్రంథాలయాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ఉపాధ్యాయులు చంద్రకళ, అనురాధ పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రీ యజ్ఞం

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని ఆర్య సమాజం ఆధ్వర్యంలో శ్రావణ మాసంలో మూడు రోజుల పాటు నిర్వహించే గాయత్రీ యజ్ఞంలో భాగంగా శనివారం రెండో రోజు కొనసాగాయి. శ్రావణి త్రిదివసీయ సహస్ర నామ గాయత్రి యజ్ఞం, యజుర్వేద పారాయణములో దంపతులు పాల్గొని యజ్ఞం నిర్వహించారు. ఆదివారం పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

జడ్చర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి పాతబజారు సమీపంలోని రంగనాయకస్వామి గుట్టపై శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా భక్తులు తరలివచ్చి, ప్రత్యేక పూజలు చేసి, తలనీలాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మహమ్మదాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతోపాలు అన్ని రంగాల్లో రాణించాలని డీఐఈవో కౌసర్ జాహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న రవీందర్ పదోన్నతిపై బదిలీ కాగా, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై ఘనంగా సన్మానించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, సభ్యులు రాంలాల్, రాజేశ్వర్, బాల్‌రాజ్ శ్రీరాములు, సీనయ్య, ముంతాజ్ పాల్గొన్నారు.

'పెంఛన్ దరఖాస్తులు ఎలా తీసుకుంటావ్'

మహమ్మదాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నాకు తెలియకుండా పెన్షన్ దరఖాస్తులు ఎలా తీసుకుంటావ్... నీవు అంత మొనగాడివా.. నేను లోకల్ లీడర్‌ను నేను తలుచుంటే నిన్ను ఇప్పుడే బదిలీ చేయిస్తా అంటూ నానా బూతులతో మండలంలోని ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శిని అధికార పార్టీ నాయకుడు మాటలు వాట్సాప్ గ్రూప్‌లో వైరల్ అవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కంచిపల్లి గ్రామ కార్యదర్శిపై ఆదే గ్రామనికి చెందిన మైనార్టీ నాయకుడు ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయం సీనియర్ కాంగ్రెస్ నాయకుల దృష్టి వెళ్లడంతో కార్యదర్శికి క్షమాపన చెప్పినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమాలు జరిగితే చర్యలు తప్పవు

కోయిలకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో చేసిన పనులకు సక్రమంగా రికార్డులు ఉండాలని అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని డీఆర్డీవో నర్సిములు పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో రెండో రోజు నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. చేసిన పనులకు రికార్డుల నమోదు పక్కాగా ఉండాలని, మస్టర్లలో దిద్దుబాట్లు ఉండడం సరి కాదన్నారు. మండలంలోని 44 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2024-25 సంవత్సరానికి సామాజిక తనిఖీలో రూ.2.41 లక్షలు రికవరీతో పాటు రూ.87 వేల జరిమానా విధించినట్లు సమాచారం. కాగా సామాజిక తనిఖీ నిర్వహణకు రూ.1,15,150 ఖర్చు అయినట్లు అధికారులు తెలిపారు. డీఆర్డీవో అడిషనల్ పీడీ ముషాహిబేగం, ఏపీడీ మంజు, ఎంపీడీవో కాళప్ప, ఎఫ్ఎమ్ హేమలత, అధికారులు సంతోష్, నర్సయ్య పాల్గొన్నారు.

నేడు పదోన్నతుల ధ్రువపత్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా విద్యాశాఖ సీనియార్టీ జాబితా 1:3 ఉపాధ్యాయుల వివరాలను శనివారం ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఏవైన అభ్యంతరాలు ఉంటే ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెలియజేయాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించన్నారు. మొత్తంగా జిల్లాలో 136 పదోన్నతుల పోస్టులు ఉండగా అందులో, ప్రభుత్వ యాజమాన్యాల నుంచి 43 మందికి, లోకల్‌బాడి పాఠశాలకు 93 మందికి పదోన్నతులు రానున్నాయి. కాగా 306 మంది ధ్రువపత్రాల పరిశీలన కోసం హాజరు కావల్సి ఉంటుంది.

సంఘ వ్యతిరేకులకు శిక్ష తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చట్టాలకు అతీతంగా పనిచేసే సంఘ వ్యతిరేక శక్తులకు శిక్ష తప్పదని టూటౌన్ సీఐ మహ్మద్ ఇజాజుద్దీన్ అన్నారు. చట్టాలను ప్రతీ ఒక్కరు గౌరవించాలని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై ఎప్పటికైనా చర్యలు తప్పవన్నారు. టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం నగరంలోని మోనప్పగుట్ట నాయీబ్రాహ్మణ సేవా సమితి సంక్షేమ భవనంలో 'ప్రజా భద్రత - పోలీసు బాధ్యత' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తోందని, చట్టానికి లోబడి జీవనం సాగించే సామాన్య ప్రజలకు ఎప్పటికీ పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సుజాత, సురక్ష పోలీసు కళాజాత బృందం సభ్యులు రాములు, జగదీశ్, బాలరాజు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు ద్వారానే బస్సులు నడిపించాలి



రాంజీకి వినతి పత్రం అందజేస్తున్న శాఖాపూర్ గ్రామస్థులు

మూసాపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం జాతీయ రహదారి శాఖాపూర్ గ్రామస్టేజీ వద్ద ఆర్టీసీ బస్సులు అండర్‌పాస్ వంతెనపై నుంచి వెళ్తున్నాయని, ఈ బస్సులు సర్వీస్ రోడ్డు ద్వారానే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని గ్రామ నాయకులు, యవకులు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ రాంజీని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. హైవేపై నుంచి వెళ్లడంతో పైకి ఎక్కలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సత్యనారాయణ, శివకుమార్, విష్ణువర్ధన్, సయ్యద్ ఖలీల్, మధు, రాఘవేందర్, భాస్కర్‌గౌడ్, భీమార్జున్‌సాగర్, రాజేష్‌సాగర్, చెన్నాసాగర్ ఉన్నారు.

ఎంపీడీవోకు వినతి

హన్వాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని బీజేపీ నాయకులు శనివారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ కమిటీ పేరుతో అర్హులకు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ వారికే ఇస్తున్నారాని అందులో ఆరోపించారు. అదే విధంగా అర్హులకు పింఛన్లు ఇవ్వాలని కోరారు.

కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి

పాలమూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులను దోపిడీకి గురిచేసే కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా రైతులు పోరాటం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, ఏఐయూకేఎస్ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి బి.రాము, కోశాధికారి సీ.హెచ్ రాంచందర్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ సభ (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభలు ఆగస్టు 25, 26వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో నేటికి రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించటంలేదన్నారు. అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్నట్లు పరిస్థితి ఉందన్నారు. ధాన్యం మార్కెట్లన్నీ కార్పొరేట్ శక్తుల చేతుల్లో బందిగా ఉన్నాయన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

మిడ్జిల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మడకుంటతండాలో శనివారం తీజ్ వేడుకలను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. శనివారం మొదలుకొని 9 రోజుల పాటు నిర్వహించే వేడుకలను భక్తిశ్రద్ధలతో, బుట్టల్లో పోసిన మొలకల తొట్లను అమ్మవారి వద్దకు ఊరేగింపుగా తీసుకవెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. నాయకులు నరేష్‌రాథోడ్, దుద్యానాయక్, మల్లేష్‌నాయక్, రాజునాయక్, చంటినాయక్, కంసీబాయి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటం

పాలమూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజా సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటం చేస్తోందని జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 5, 6వ తేదీల్లో జడ్చర్ల పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ 23వ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావుతో పాటు మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి హాజరవుతున్నారన్నారు.

సీనియర్ల సేవలు చిరస్మరణీయం : ఎస్పీ

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొంతుతున్న సీనియర్ అధికారుల సేవలు చిరస్మరణీయమని, అలాంటి అధికారులు ఉద్యోగ విరమణ పొందడం శాఖా పరంగా ఇబ్బందికరమే అయినా ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదని ఎస్పీ జానకి అన్నారు. జూలై మాసంతో ఉద్యోగ విరమణ పొందుతున్న సబ్ ఇన్స్‌పెక్టర్లు లక్ష్మారెడ్డి, పి.అంజయ్య, ఏఎస్ఐలు ఎండీ సైదుద్దీన్, విష్ణును ఎస్పీ తన కార్యాలయంలో శనివారం సత్కరించి, మాట్లాడారు. అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, పరిపాలన అధికారి రుక్మిణిబాయి, ఎస్బీ సీఐ రాంరెడ్డి, ఆర్ఐ కృష్ణయ్య, సూపరింటెండెంట్ మధుసూదన్, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడిగా రాజేశ్వర్



నూతన అధ్యక్షుడు రాజేశ్వర్‌ను సత్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : క్రెడాయ్ (కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్‌ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) బిల్డర్స్ డెవలపర్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా చెరుకుపల్లి రాజేశ్వర్ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ మోటార్స్ కార్యాలయంలో క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెక్కరి రాంరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా రాఘవేందర్ గౌడ్, అంబటి మణిదీప్, అబ్దుల్ ఖదీర్, బోగ కోదండపాణి, ప్రధాన కార్యదర్శిగా కడుదాస్ రాజేశ్, జాయింట్ సెక్రెటరీలుగా కృష్ణబాబు, మహ్మద్ సిరాజ్, తిరుపతిరెడ్డి, కోశాధికారిగా మణ్యంరెడ్డి, ఈసీ సభ్యులుగా రాంచందర్‌రావు, రాజ్‌కుమార్‌రెడ్డి, మయూర్ పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.